

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.13 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

37.8°/23.4°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. వాయువ్య దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జనావాసాల్లోకి భల్లూకం



ఇళ్ల మధ్య ఎలుగుబంటి సంచరిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీలోని విద్యానగర్‌లోకి మంగళవారం అర్ధరాత్రి ఎలుగుబంటి చొరబడింది. భల్లూకాన్ని చూసి కుక్కలు పెద్ద ఎత్తున అరిచాయి. ఈ క్రమంలో నిద్రలేచిన కొందరు ఎలుగుబంటిని చూసి హడలిపోయారు. వారం క్రితం స్థానిక పూర్ణానంద స్వామి ఆశ్రమం పక్కన ఉన్న బిస్కెట్ ఏజెన్సీ గోడౌన్‌లోకి ఎలుగుబంటి దూరింది. ఇప్పుడు ఏకంగా ఇళ్ల మధ్యకు రావడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అటవీ శాఖ అధికారులకు విన్నవించినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ప్రాణాపాయం సంభవిస్తే తప్ప స్పందించరా అంటూ మండిపడుతున్నారు.

రైతుపై ఎలుగుబంట్ల దాడి



చికిత్స పొందుతున్న రామన్న

కళ్యాణదుర్గం రూరల్: రైతుపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఉప్పొంక వద్ద జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన రామన్న బుధవారం తెల్లవారుజామున తన పొలానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో పొదల చాటున ఉన్న రెండు ఎలుగుబంట్లు ఒక్కసారిగా రామన్నపై దూకి దాడి చేశాయి. బాధితుడు గట్టిగా కేకలు వేయడంతో పక్కనే ఉన్న పొదల్లోకి పారిపోయాయి. తలకు తీవ్ర గాయమైన రామన్నను స్థానికులు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు.

'దుర్గం' ఆర్డీఓ కార్యాలయానికి ఐఎస్‌ఓ సర్టిఫికెట్



ఆర్డీఓ కార్యాలయానికి పంపిన ఐఎస్‌ఓ గుర్తింపు సర్టిఫికెట్

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయానికి ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికెట్ గుర్తింపు లభించింది. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు బుధవారం సర్టిఫికెట్ అందించినట్లు ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ, జనరల్ అడ్మినిస్ట్రేషన్, లా అండ్ ఆర్డర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సర్వీసులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో ఐఎస్‌ఓ గుర్తింపు ఇచ్చినట్లు ఆర్డీఓ తెలిపారు. కార్యాలయానికి ఐఎస్‌ఓ గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగుల కృషితోనే గుర్తింపు లభించిందన్నారు. గురువారం అనంతపురంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకోనున్నట్లు ఆర్డీఓ తెలిపారు.

శరవేగంగా టీబీ డ్యాం గేటు ఏర్పాటు పనులు



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి కేశవ్

అనంతపురం టవర్‌క్లాక్: తెగిపోయిన తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్ గేట్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడానికి శరవేగంగా పనులు చేపడుతున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గేటు ఏర్పాటుకు మూడు కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. గురువారంలోపు తయారీ పనులు పూర్తవుతాయన్నారు. అనంతరం జిందాల్ కంపెనీకి చెందిన రెండు క్రేన్ల ద్వారా గేటు ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ ప్రక్రియ నిర్విఘ్నంగా పూర్తి కావాలని ఎంతో మంది రైతులు కోరుకుంటున్నారని, వారి ఆశలు తప్పకుండా ఫలిస్తాయని మంత్రి చెప్పారు. అంతకుముందు ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. పలువురి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, డీపీఓ ప్రభాకర్ రావు, డీడీ నరసింహారావు, పీడీ రఘునాథ రెడ్డి, ఏడీ ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.



మువ్వన్నెల వెలుగుల్లో అనంతపురం టవర్‌క్లాక్



ముస్తాబైన అనంతపురం పోలీస్ పరేడ్ గ్రౌండ్



కట్టకిందపల్లిలో బుధవారం కాడెద్దులకు జెండా కట్టి గుంటక తోలుతున్న సూర్యనారాయణ రెడ్డి

జెండా పండుగకు వేళాయె

జిల్లావ్యాప్తంగా గురువారం స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా జరగనుంది. వేడుకలకు అనంతపురంలోని పోలీసు పరేడ్ మైదానం ముస్తాబయ్యింది. జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 9 గంటలకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. సాయుధ బలగాల వందనం స్వీకరిస్తారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకిస్తారు. స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన 320 మంది అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు బుధవారం ఉదయం ఎస్పీ మురళీకృష్ణ పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. – అనంతపురం అర్బన్

ప్రైవేటు పాట.. కష్టాల మూట!

- రెండు నెలల్లోనే సర్వజనాస్పత్రిలో అధ్వాన పరిస్థితులు
- పడకేసిన పరిపాలన
- ఓపీ చీటీ తీసుకునేందుకే గంటల సమయం
- పేద రోగులకు తప్పని అవస్థలు
- 'పీపీపీ' మాటున ప్రభుత్వమే సమస్యలు తెచ్చిపెడుతోందని విమర్శలు



- ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రామాంజనేయులు. పామిడి గ్రామానికి చెందిన ఈయన కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్నారు. దీంతో రెండు రోజుల క్రితం భార్య భాగ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు రామాంజనేయులును జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఓపీ తీసుకోవడానికి గంట సమయం పట్టింది. ఆ తర్వాత వైద్యం, మందులు తీసుకునేందుకు మధ్యాహ్నమైంది.



- తన మనవరాలు భవానితో కలిసి వేచి ఉన్న ఈమె పేరు నాగమునెమ్మ. నార్పల మండలం పులసలనూతల గ్రామం. మనవరాలికి కడుపునొప్పి అంటే బుధవారం ఉదయం 9 గంటలకే సర్వజనాస్పత్రికి తీసుకొచ్చింది. ఆస్పత్రిలో చూస్తే వైద్యులు సమయానికి రాలేదు. అప్పటివరకూ చిన్నారి నొప్పి తట్టుకోలేక తల్లడిల్లిపోయింది. తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని, నార్పలకు నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి ఆటో పట్టుకుని ఆస్పత్రికి వచ్చినట్లు నాగమునెమ్మ తెలిపారు.



అనంతపురం సర్వజనాస్పత్రిలో ఓపీ చీటీ కోసం మహిళల పాట్లు

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో మళ్లీ పాత రోజులు కనిపిస్తున్నాయా? ఉద్దేశ పూర్వకంగానే ఆస్పత్రుల నిర్వహణను గాలికొదిలేశారా? మందులు అయిపోయినా, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అందుకే పట్టించుకోవడం లేదా? ప్రభుత్వ ఆస్పత్రులపై క్రమంగా ప్రజలకు దురభిప్రాయం కలగజేసి ప్రైవేటుకు కట్టబెట్టాలన్నదే సర్కారు లక్ష్యమా? అంటే అవుననే మాటలే వినిపిస్తున్నాయి. జిల్లా ప్రజలకు పెద్దదిక్కైన అనంతపురం సర్వజనాస్పత్రిలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు గమనిస్తే ఇదంతా వాస్తవమేననిపిస్తుంది. సర్వజనాస్పత్రిలో వైద్య సేవలు అధ్వానంగా మారాయి. ఉమ్మడి జిల్లా ప్రజలకు ఆదరువుగా ఉన్న ఈ ఆస్పత్రిలో ఓపీ నుంచి అడ్మిషన్ పొందే వరకు రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది. గత ప్రభుత్వం బోధనాస్పత్రిని బలోపేతం చేస్తే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలల వ్యవధిలోనే అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి.

వైద్యుల ఇష్టారాజ్యం

సర్వజనాస్పత్రిలో పాలన పడకేసింది. దీంతో వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అలస్యంగా విధులకు హాజరవడమే కాకుండా, వచ్చిన కొంత సేపటికే వెళ్లిపోతున్నారు. సర్వజనాస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండాలి. కానీ అటువంటి పరిస్థితి లేదు. ఆర్థో, సైకియార్టీ, చిన్నపిల్లల వార్డు, మెడిసిన్, సర్జరీ, డెంటల్, పల్మనాలజీ, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో పీజీ వైద్యులే అధికంగా దర్శనమిస్తున్నారు. అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లు పీజీలపై భారం వేసి వెళ్లిపోతున్నారు.

మందులు కొనాల్సిందే..

జీజీహెచ్‌ను మందుల కొరత పట్టి పీడిస్తోంది. అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో ప్రాణాంతక కేసులకు అందించే డాక్సీసైక్లిన్, సోడియం బై కార్బొనేట్, పామ్, లివిప్రిల్, సోడియం వాల్పరేట్, ఇన్సులిన్ తదితర మందులు, ఆక్సిజన్ మాస్క్‌లు, పీఎంవీ లైన్ సెట్‌లు లేవు. పాంటాప్ (గ్యాస్ట్రిక్‌కు వినియోగించే మందు) ఐవీ నో స్టాక్‌గా నమోదు చేశారు. దీంతో రోగులు సొంత డబ్బు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. రక్తపూతలు తీసుకునేందుకు వినియోగించే ఇంజెక్షన్లు నాసిరకంగా ఉంటున్నాయి. అందులో పౌడర్ వస్తుండడంతో టెక్నీషియన్లు ఆందోళన చెందుతున్నారు. ఇక.. బయోకెమిస్ట్రీ, పెథాలజీ, మైక్రో బయాలజీ విభాగాల్లో రక్త పరీక్షల నిర్ధారణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. బయోకెమిస్ట్రీ విభాగంలో ఫుల్లీ ఆటోమేటిక్ అనలైజర్ ద్వారా వందల సంఖ్యలో పరీక్షలు చేస్తుండడంతో ఎలక్ట్రోలైట్స్, తదితర పరీక్షల జాప్యం జరుగుతోంది. మైక్రో బయాలజీ విభాగంలో బ్లడ్, యూరిన్, ఇతర కల్చర్ పరీక్షలు జరగడం లేదు.

గర్భిణులు, బాలింతల అవస్థలు..

సర్వజనాస్పత్రిలో పడకలు లేక గర్భిణులు, బాలింతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకే మంచంపై ఇద్దరు ఉంటున్నారు. నాలుగు యూనిట్లకుగానూ కేవలం 120 పడకలే ఉన్నా 270 మంది వరకు గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్నారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోవిడ్‌తో రెండున్నరేళ్లు గడిచిపోయినా అనతి కాలంలోనే ప్రభుత్వం రూ.300 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్, సర్జికల్ బ్లాక్, పీజీ క్వార్టర్స్‌ను మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం ఎంసీహెచ్ బ్లాక్‌ను ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తుందో అంతుపట్టడం లేదు.

స్కానింగ్ కోసం తిరుగుతున్నాం..



నా బిడ్డ తౌఫిక్‌కు గొంతులో సమస్య ఉంటే సర్వజనాస్పత్రికి వచ్చాం. వైద్యులు పరీక్షించి అల్ట్రాసౌండ్ స్కాన్ రాశారు. ఆ పరీక్ష కోసం మూడు రోజులుగా ఆస్పత్రికి వస్తున్నాం. ఇక్కడ చూస్తే పట్టించుకునే వారు లేరు.

– సల్మా, జాకీర్ కొట్టాలు, అనంతపురం

చర్యలు తీసుకుంటాం

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకుంటాం. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. రక్త పరీక్షల జాప్యంపై పరిశీలిస్తాం. వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

- సర్వజనాస్పత్రిలో రోజూ ఓపీ 2,500
- రోజూ అడ్మిషన్లు 250కిపైగా
- ఓపీ సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటలు



సర్వజనాస్పత్రి చిన్న పిల్లల విభాగంలో కానరాని వైద్యులు



10 గంటలైనా డాక్టర్లు రాకపోవడంతో ఆర్థో విభాగం వద్ద రోగుల పడిగాపులు



రేడియాలజీ విభాగంలో పీజీ డాక్టర్లే స్కానింగ్ చేస్తున్న దృశ్యం

'గుమ్మఘట్ట'లో దంచేసిన వాన

- 129.2 మి.మీ వర్షపాతం నమోదు
- 23 మండలాల పరిధిలో 15.3 మి.మీ సగటు వర్షపాతం
- రాగల మూడు రోజులూ భారీ వర్షాలు

అనంతపురం అగ్రికల్చర్: గుమ్మఘట్ట మండలంలో వాన దంచేసింది.129.2 మి.మీ భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలోని 23 మండలాల పరిధిలో 15.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. రాయదుర్గం మండలంలో 75.6 మి.మీ, డీ.హీరేహాళ్ 52 మి.మీ,బ్రహ్మసముద్రం 50 మి.మీ, విడపనకల్లు 29.4 మి.మీ, కుందుర్పి 26.6 మి.మీ, శెట్టూరు 13.2 మి.మీ, బెళుగుప్ప 12.6 మి.మీ వర్షపాతం నమోదైంది. గార్లదిన్నె, కణేకల్లు, కళ్యాణ దుర్గం, యల్లనూరు, రాప్తాడు,బుక్కరాయసముద్రం, అనంతపురం, పెద్దపప్పూరు మండలాల్లోనూ తుంపర్లు పడ్డాయి.

మూడు రోజులూ వర్షాలు

అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాగల మూడు రోజులూ జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నెల 18వ తేదీ వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎల్లో అలర్ట్ కొనసాగుతుందని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు,సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి బుధవారం విడుదల చేసిన బులిటెన్‌లో తెలిపారు. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగుపాటుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు.ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 83.8 మి.మీ కాగా 38.2 మి.మీ నమోదైంది. మొత్తంగా జూన్ 1 నుంచి 159.1 మి.మీ గానూ 32 శాతం అధికంగా 210.3 మి.మీ వర్షం కురిసింది.

యువత బాధ్యతగా వ్యవహరించాలి

- డీఆర్‌ఎం విజయ్‌కుమార్



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు: సమాజం పట్ల అవగాహన పెంచుకుని యువత బాధ్యతగా వ్యవహరించాలని డీఆర్‌ఎం విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. విభజన భయానక స్మృతి దినం సందర్భంగా స్థానిక రైల్వే జంక్షన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంలో బుధవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహన్, సీనియర్ డీసీఎం మనోజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైల్వే ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డీఆర్‌ఎం మాట్లాడుతూ 1947లో దేశం ఇండియా, పాకిస్తాన్‌గా విడిపోయిన సమయంలో జరిగిన అల్లర్లు, ఘర్షణల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. అసువులు బాసిన వారికి నివాళులర్పిస్తూ మూడేళ్లుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే హైస్కూల్ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, తదితరులున్నారు.

పలువురు సీఐల బదిలీ



అనంతపురం సెంట్రల్: అనంతపురం రేంజ్ పరిధిలో పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు (సీఐలు) బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేటాయించిన స్థానాల్లో వెంటనే చేరిపోవాలని అధికారులను ఆదేశించారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
నాగేంద్ర ప్రసాద్	తాడిపత్రి అర్బన్	ధర్మవరం వన్‌టౌన్
సాయి ప్రసాద్	ఓర్వకల్ ఎయిర్‌పోర్టు	తాడిపత్రి అర్బన్
రెడ్డప్ప	అనంతపురం వన్‌టౌన్	ధర్మవరం టూటౌన్
అశోక్‌కుమార్	ధర్మవరం టూటౌన్	వీఆర్, పుట్టపర్తి
ప్రభాకర్	ఏసీబీ, అనంతపురం	ధర్మవరం రూరల్
అరోహణరావు	ధర్మవరం రూరల్	వీఆర్, పుట్టపర్తి
అబ్దుల్ ఖరీమ్	వీఆర్,కడప	హిందూపురం టూటౌన్
నాగేంద్ర	దిశ, అన్నమయ్య జిల్లా	కదిరి రూరల్
కొలుట్లయ్య	కడప తాలూకా స్టేషన్	శింగనమల
మనోహర్	మడకశిర	గుంతకల్లు వన్‌టౌన్
రామసుబ్బయ్య	గుంతకల్లు	వీఆర్, అనంతపురం
శివ గంగాధర్‌రెడ్డి	ఏసీబీ, అనంతపురం	తాడిపత్రి రూరల్
లక్ష్మీకాంతరెడ్డి	తాడిపత్రి రూరల్	వీఆర్, అనంతపురం
ఈరన్న	వీఆర్, పుట్టపర్తి	యాడికి
నాగార్జునరెడ్డి	యాడికి	వీఆర్, అనంతపురం
వెంకటేశ్వర్లు	వీఆర్, అనంతపురం	గుత్తి
వెంకటరమణ	ప్రొద్దుటూరు త్రీటౌన్	రాయదుర్గం రూరల్
సంజీవకుమార్	మహిళా పీఎస్, అనంతపురం	ట్రాఫిక్, తిరుపతి

అంత స్ట్రిక్ట్ అధికారి వద్దు 'బాబో'య్!

- జేసీ హరిత నియామక ఉత్తర్వులు రద్దు చేసిన ప్రభుత్వం
- ముక్కుసూటి అధికారి కావడంతోనే తప్పించారనే విమర్శలు



అనంతపురం అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా 2018 ఐఏఎస్ బ్యాచ్ అధికారి డి.హరితను నియమిస్తూ ఈనెల 9న ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనెల 14న ఆమె బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం అందడంతో అందుకు అవసరమైన ప్రక్రియను కలెక్టరేట్ వర్గాలు సిద్ధం చేసి ఉంచాయి. అయితే ఆమె రాలేదు... కాదు ఆమె పోస్టింగ్ ఉత్తర్వులను ప్రభుత్వం 13వ తేదీనే రద్దు చేసింది. తొలుత ఆమెను కె.ఆర్.పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా నియమిస్తూ జూలై 22న ఉత్తర్వులు జారీ అయ్యాయి. వాటిని సవరిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ఈనెల 9న ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా వాటిని కూడా రద్దు చేయడం గమనార్హం.

స్ట్రిక్ట్ ఆఫీసర్‌గా గుర్తింపు : డి.హరిత పనిచేసిన ప్రతి చోటా స్ట్రిక్ట్ ఆఫీసర్‌గా గుర్తింపు పొందారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ముక్కుసూటిగా పని చేస్తారనే ప్రచారం ఉంది. అలాంటి అధికారి జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా వస్తే తమ ఆటలు సాగవని గ్రహించిన కొందరు రాజకీయ నాయకులు ప్రభుత్వం వద్ద చక్రం తిప్పి... ఆమె నియామక ఉత్తర్వులను రద్దు చేయించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



క్లుప్తంగా

సరిహద్దు ప్రాంతాల్లో నిఘా మరింత ముమ్మరం

- సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



రాయదుర్గం సెబ్ పీఎస్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

రాయదుర్గం: జిల్లాలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత ముమ్మరం చేస్తామని సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్ అన్నారు. బుధవారం రాయదుర్గం సెబ్ పీఎస్‌ను ఆయన ఆకస్మికంగా పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, మద్యం, పెండింగ్ కేసుల పురోగతి పై సీఐ మురళీ మోహన్‌తో ఆరా తీశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ మాట్లాడారు.. జిల్లాలోని కళ్యాణదుర్గం, కంబదూరు, రాయదుర్గం, కణేకల్లు సెబ్ పోలీస్‌స్టేషన్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. అక్రమంగా మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, మద్యం వివరాలను సరిచూశామన్నారు. కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చే వరకు కర్ణాటక రాష్ట్రం నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం రవాణా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. గంజాయి, నాటుసారా తయారీ కేంద్రాలపై నిఘా ఉంచామన్నారు. మట్కా, పేకాట నిర్వాహకులపై దృష్టి సారించి కఠిన చర్యలు చేపడతామన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. మహారాష్ట్ర, గోవా కు చెందిన మద్యం అక్రమంగా ఐచర్‌లో రవాణా చేస్తూ రాయదుర్గంలో పట్టుబడిన విషయాన్ని గుర్తు చేశారు. సీఐ, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ పాలక మండళ్లపై కన్ను

- ప్రభుత్వ పెద్దల చుట్టూ 'తమ్ముళ్ల' ప్రదక్షిణలు
- ఈ నెలలోనే ఆలయ పాలక మండళ్ల నియామకానికి నోటిఫికేషన్?
- చైర్మన్ గిరి కోసం టీడీపీ నాయకుల్లో నెలకొన్న పోటీ

అనంతపురం కల్చరల్: జిల్లా వ్యాప్తంగా ఆలయ పాలక మండళ్లను మార్చే యోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. ఇందుకు సంబంధించి సన్నాహాలు చేస్తుండడంతో టీడీపీ నాయకులు అప్రమత్తమయ్యారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు మొదలు పెట్టారు. మరికొందరు ఏకంగా రాజధానిలోనే మకాం వేసి పైరవీలు సాగిస్తున్నట్లు సమాచారం.

ఆ రెండు మినహా...

శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని నసనకోట ముత్యాలమ్మ, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం సమీపంలోని చిల్లవారిపల్లి అక్కమ్మ ఆలయాల పాలక మండళ్లు మినహా అన్ని రద్దయ్యాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వం మాది... ఇక్కడ మేము చెప్పిందే జరగాలి అనే ధోరణితో టీడీపీ నాయకులు అనధికారికంగా కొన్నింటిని రద్దు చేయించారు. దీంతో ఈ నెలలోనే ఆలయ ధర్మకర్తల మండళ్ల నియామకానికి నోటిఫికేషన్ వెలువడుతుందనే అంచనాతో టీడీపీ నాయకులు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చాలామంది అధిక ఆదాయమున్న ఆలయాల పాలక మండళ్లపై దృష్టి సారించారు.



చైర్మన్ గిరి కోసం పెరుగుతున్న పోటీ

జిల్లాల పునర్విభజనకు ముందు నుంచే ఆలయాలను దేవదాయశాఖ పరిధిలో అనంతపురం, హిందూపురం, ఉరవకొండ డివిజన్లుగా ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అవే డివిజన్లు కొనసాగుతున్నాయి. ఈ డివిజన్ల పరిధిలో మొత్తం 2,833 ఆలయాలు దేవదాయశాఖ పరిధిలో ఉన్నాయి. వీటిలో అనంతపురం జిల్లా కింద 1,694, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 1,139 ఆలయాలున్నాయి. ఈ క్రమంలోనే ఆయా ఆలయాలకు ఏటా సమకూరే ఆదాయాన్ని బట్టి విభాగాలుగా విభజించారు. అనంతపురంలో 6ఏ కింద 10, 6బీ కింద 36, 6సీ కింద 1,642, 6డీ కింద 6 దేవాలయాలుండగా, శ్రీసత్యసాయి (హిందూపురం డివిజన్‌లో అంతర్భాగం) జిల్లాలో 6ఏ కింద 2, 6బీ కింద 10, 6సీ కింద 1124, 6డీ కింద 5 దేవాలయాలున్నాయి. రూ.5 కోట్ల నుంచి రూ.25 కోట్లకు పైగా ఆదాయం ఉన్న ఆలయాలు ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ పరిధిలో చేర్చారు. ఈ ఆలయాల్లో గతంలో కొనసాగిన మేనేజర్లు, కార్యదర్శుల పాలనను గత ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే 6ఏ పరిధిలో పెన్నహోబిలం, పంపనూరు, గూగూడు, ఆలూరు, తొండపాడు, నేమకల్లు, మురడి, రాయదుర్గంలోని రాణిసత్రం, అశ్వత్థం, మడకశిరలోని భక్తరహళ్లి తదితర ఆలయాలున్నాయి. ఇవి కూడా రూ.25 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఆదాయమున్న ఆలయాలే. వీటన్నింటికీ పాలక మండళ్లను నియమించాల్సి ఉంది. 6సీ పరిధిలో వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపే ఉంటుంది, 6డీ పరిధిలో సత్రాలు, మఠాలు వస్తాయి. వీటికి పాలక మండళ్లు దాదాపు ఉండక పోవచ్చు. దీంతో అధిక ఆదాయమున్న ఆలయాలకు చైర్మన్ గిరి తమకంటే తమకే కావాలంటూ టీడీపీ నేతలు పోటీ పడుతున్నారు.

నగరంలో 'దగ్గుపాటి' మార్క్

అధిక ఆదాయం గడిస్తున్న వాటిలో జిల్లా కేంద్రం అనంతపురంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం కూడా ముందు వరుసలో ఉంది. నగరంలోనే అతి ప్రాచీనమైన చెన్నకేశవస్వామి ఆలయం, పాతూరు విరూపాక్షేశ్వరాలయం, సున్నంగేరులోని రామాలయం, బసవన్న కట్ట వంటి ఎండోమెంటు పరిధిలోని ఆలయాలకు ఘనమైన చరిత్ర ఉన్నా.. ఆదాయం అంతంత మాత్రమే ఉండడంతో వీటి వైపు టీడీపీ పెద్దలు పెద్దగా దృష్టి సారించలేదని తెలుస్తోంది. ఏడాదికి రూ.30 లక్షలకు పైగా ఆదాయమున్న మొదటిరోడ్డు శివాలయం పాలక మండలి పగ్గాల కోసం ఇప్పటికే ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు రంగంలో దిగారు. తమకు తెలియకుండా ఏ నిర్ణయం తీసుకోకూడదని నేరుగా ఆలయ అధికారులను హెచ్చరించినట్లు సమాచారం. గతంలో చైర్మన్‌గా పనిచేసిన వారు కూడా పోటీలో ఉండడంతో ఈసారి కొత్తవారికి ఇద్దామని ఎమ్మెల్యేనే సూచించినట్లు తెలుస్తోంది.

అగ్రరాజ్య గగన తలంలో తిరంగా రెపరెపలు

- 20 వేల అడుగుల ఎత్తున ప్రదర్శించిన అనంత యువకుడు



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న అఖిల్

అనంతపురం కల్చరల్: అగ్రరాజ్యమైన అమెరికా గగన తలంపై మువ్వెన్నల జెండా రెపరెపలాడింది. అనంతపురం నగరానికి చెందిన రమణారెడ్డి కుమారుడు అఖిల్ గత 6 ఏళ్లుగా అమెరికాలోనే ఉంటున్నారు. అనేక సందర్భాల్లో అక్కడ తన దేశభక్తిని చాటుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 13న 20 వేల అడుగుల ఎత్తున స్కైడైవింగ్ చేస్తూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. దాదాపు గంటకు పైగా ఈ దృశ్యం ప్రవాస భారతీయులతో పాటు పలువురు అమెరికన్లకూ కనువిందు చేసింది. ఖండాంతరాలు దాటి వచ్చినా భరత జాతి ఇచ్చిన ప్రోత్సాహాన్ని మరచిపోలేమని, విభిన్నమైన సంస్కృతీసంప్రదాయాలకు నిలయమని భారతీయులందరికీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు అంటూ అమెరికా నుంచి అఖిల్ ట్వీట్ చేయడం గమనార్హం.

అక్రమ మద్యం ధ్వంసం

కణేకల్లు: కర్ణాటక నుంచి జిల్లాకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యాన్ని సెబ్ అధికారులు బుధవారం హెచ్చెల్సీ గట్టుపై ధ్వంసం చేశారు. 72 కేసుల్లో పట్టుబడిన నాన్ డ్యూటీ పెయిడ్ (కర్ణాటక మద్యం)తో పాటు ఆంధ్రా మద్యం 446 లీటర్లను ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ తెలిపారు. వీటి విలువ రూ.2.13లక్షలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కణేకల్లు సెబ్ సీఐ మురళీకిషోర్, ఎస్‌ఐ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

మూడు బైక్‌ల వేలం

కణేకల్లు సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సరఫరా చేస్తూ పట్టుబడి సీజ్ చేసిన మూడు బైక్‌లను వేలం వేసినట్లు సెబ్ సీఐ మురళీకిషోర్, ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపారు. రూ.25,724 ఆదాయం సమకూరిందన్నారు. ఓ బైక్ స్క్రాప్ కింద వేలం వేసినట్లు తెలిపారు.

కీర్తి ఆత్మహత్య కేసులో ప్రియుడిపై కేసు నమోదు



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కీర్తి తండ్రి అజీ

గుంతకల్లు: నర్సింగ్ విద్యార్థి కీర్తి ఆత్మహత్య వెనుక మిస్టరీని పోలీసులు ఛేదించారు. ప్రియుడితో తలెత్తిన అభిప్రాయ భేదాలే ఆమెను ఆత్మహత్యకు పురిగొల్పాయని నిగ్గు తేల్చారు. వివరాలను గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ బుధవారం వెల్లడించారు. గుంతకల్లులోని రమ్యసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో థర్డ్ ఇయర్ చదువుతున్న కేరళలోని యర్నాకులం నగరానికి చెందిన కీర్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు వేగవంతం చేశారు. కీర్తి సెల్‌ఫోన్‌లో ప్రియుడు అశ్విన్ చాటింగ్‌ను గుర్తించారు. కేరళకు చెందిన అశ్విన్, కీర్తి మధ్య కొన్నేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుస్తున్నట్లుగా తెలుసుకున్నారు. అయితే మంగళవారం కీర్తి, అశ్విన్ మధ్య చాలాసేపు చాటింగ్ జరిగింది. 'నువ్వు ఫ్రాడ్' అంటూ కీర్తిని కించపరుస్తూ ఆమె ఆత్మాభిమానం దెబ్బతినేలా అనుమానాలు వ్యక్తం చేస్తూ చాటింగ్ చేశాడు. దీంతో మనస్తాపం చెందిన కీర్తి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా నిర్ధారించారు. కేరళ నుంచి కీర్తి తండ్రి అజీ, బంధువులు బుధవారం మధ్యాహ్నం గుంతకల్లు చేరుకున్నారు. ఆయనకు అశ్విన్ చాటింగ్‌లోని అంశాలను పోలీసుల సమక్షంలో కళాశాల యాజమాన్యం చూపించింది. సెల్‌ఫోన్ ఆధారంగా మృతురాలి తండ్రి అజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్విన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కీర్తి మృతదేహాన్ని బంధువులకు అప్పగించడంతో ప్రత్యేక అంబులెన్స్‌లో కేరళకు తరలించారు.

ఆ స్మృతులు ఎంతో మధురం

- ఊరంతా జెండా పండుగే
- తలుచుకుంటే ఇప్పటికీ రోమాలు నిక్కబొడుస్తాయి



భోగవల్లి రామనాథశర్మ

అనంతపురం కల్చరల్: 'నాకిప్పుడు 90 ఏళ్లు దాటిపోయాయి. నా 13వ ఏటా దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఆ రోజు సంబరాలు తలుచుకుంటే ఇప్పటికీ రోమాలు నిక్కబొడుచుకుంటాయి' అంటూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన 1947, ఆగస్టు 15న నాటి అంశాలను కళ్లకు కట్టినట్లుగా వివరించారు శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన భోగపల్లి రామనాథశర్మ. ఆనాటి స్మృతులు ఆయన మాటల్లోనే..

ఊరంతా ఉరకలేసిన ఉత్సాహం

యాదృచ్ఛికమే అయినా అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం కూడా ఇలాంటి గురువారం నాడే దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించింది. తెల్లారితే శుక్రవారం (1947, ఆగస్టు 15) ఊరంతా దేశభక్తి ఉరకలేస్తోంది. ఎవరి చేతిలో చూసినా జాతీయ జెండాలు రెపరెపలాడుతున్నాయి. వీధులన్నీ జాతీయ పతాకాలతో నిండిపోయాయి. ఊరువాడ అంతా ఏకమై భరతమాతను కీర్తిస్తూ మురిసిపోయింది. ఓ వైపు వందేమాతర గేయం మార్మోగుతుంటే మరో వైపు జాతీయ గీతాలాపనలు మృదుమధురంగా వినపడ్డాయి. వయసు తారతమ్యం లేకుండా అందరూ మమేకమై వేడుకల్లో పాలు పంచుకున్నారు. కులాలు, మతాలు వేరైనా మేమంతా ఒకటేనన్న భావన అందరిలోనూ కనిపించింది. ఆ ఆనందం... సంబరం ... మాటల్లో చెప్పలేకపోతున్నా.

మహాత్ముడి స్ఫూర్తితో...

మా నాన్న భోగపల్లి వెంకప్ప శాస్త్రి, అమ్మ రామలక్ష్మమ్మ ఇద్దరూ ఇల్లెంతో సమాజమంతే అనే భావనను మాలో రగిలించారు. నాన్నతో పాటు వ్యవసాయం చేసుకుంటూనే పౌరోహిత్యం చేసేవాడిని. అలా మా పక్క ఊర్లలోనే ఉన్న నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డి వంటి ఉద్దండుల ఇళ్లకు వెళ్లి కార్యక్రమాలు నిర్వహించి వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. వారిని కలుసుకునే అవకాశమే కాదు వారు చేస్తున్న పోరాటాలు, ఉద్యమాల స్ఫూర్తిని పల్లెలంతా రగిలించేవాళ్లం. నా చిన్నప్పుడు ఒకసారి పెద్దవడుగూరు గ్రామానికి మహాత్మా గాంధీజీ వచ్చారు. ఆయనను దగ్గర నుంచి చూసి నమస్కరించి వచ్చాను. అలాగే నెహ్రూను కూడా జిల్లా పర్యటనలో చూశా. మహాత్ముడి స్ఫూర్తితో వీధి నాటకాల ద్వారా ప్రజలను చైతన్య పరిచి స్వాతంత్ర్య సంగ్రామంలో పాలు పంచుకునేలా చేసేవాళ్లం. పౌరాణిక నాటకాలతో పాటూ దేశభక్తి ప్రబోధిత నాటకాలతో చైతన్యం వస్తుందన్న జాతీయ నాయకుల సూచనల మేరకు ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాం. నాలాంటి వయసుపైబడిన వారు ఏదైనా చెబితే ఛాందస భావాలంటారు కానీ, కులం, మతం అనే పట్టింపులు ఇప్పుడే పెరిగిపోయాయి. ఆ రోజుల్లో అందరమూ అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉండేవాళ్లం.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: 'జీవ వైవిధ్య సంరక్షణ–యువత పాత్ర' అంశంపై విద్యార్థులకు బుధవారం జిల్లా విద్యాశాఖ, రాష్ట్ర జీవ వైవిధ్య సంరక్షణా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్థానిక సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ, ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ ఆనందభాస్కర్‌రెడ్డి పర్యవేక్షించారు. విజేతలను జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి అభినందించారు.



'ఏపీజీఎల్ఐ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి'



ఏపీజీఎల్ఐ డీడీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఏపీజీఎల్ఐ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏపీజీఎల్ఐసీ డీడీ భాస్కర్‌తేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్ మాట్లాడుతూ... ఏపీజీఎల్ఐ పాలసీదారులకు తుది చెల్లింపులు, రుణాల మంజూరు, చెల్లింపులు, డెత్ క్లెయిమ్స్ సమస్యలను వెంటనే పరిష్కరించని కారణంగా ఆర్థిక సాయం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తమ వార్షిక ఖాతా నిలువల్లో మిస్సింగ్ క్రెడిట్స్ లేకుండా తక్షణమే నవీకరించి విడుదల చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఏపీజీఎల్ఐ పాలసీ పరిణతి చెందిన పాలసీదారులకు తుది చెల్లింపులు వెంటనే చేయాలన్నారు. కార్యాలయ రికార్డుల ఆధారంగా మిస్సింగ్స్ క్రెడిట్స్ గుర్తించి నవీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్ వలి, వెంకటరమణ, నాయకులు వన్నప్ప, గోరంట్ల శ్రీనివాసులు, కలీముల్లా, తిప్పేస్వామి, శ్రీనివాసులు, హనుమంతు, నస్రుల్లా, రంగా నాయుడు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కూడేరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరుకు చెందిన రైతు బోయ నారాయణ(45)కు భార్య ముత్యాలమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లిన నారాయణ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలానికి వెళ్లి చూశారు. అప్పటికే మోటార్ దగ్గర అపస్మారకంగా పడి ఉన్న నారాయణను గుర్తించి బోరున విలపిస్తూ అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు విద్యుత్ షాక్ కారణంగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అంతర్జాతీయ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ– బ్లెకింగ్ సాంకేతిక విశ్వవిద్యాలయం (స్వీడన్) సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సహకార కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ సీఎస్ఈ, ఈసీఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు జేఎన్‌టీయూ వెబ్‌సైట్లో లేదా కళాశాలలోని విదేశీ వ్యవహారాల డెరెక్టర్, అల్యూమినీ కార్యాలయంలో ఈ నెల 19 నుంచి 24లోగా సంప్రదించాలని కోరారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులు ఉండడంతో పాటు జేఈఈ మెయిన్స్–2024, ఈఏపీసెట్‌లో పొందిన ర్యాంకు ఆధారంగా ఎంపిక చేస్తారని వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ఆఫీస్ ఆటోమేషన్ కోర్స్

■ కేవలం ఫీజు: 3750/- రాయితీతో దరఖాస్తులు. AP-SBTET ద్వారా పాస్ అయిన సర్టిఫికెట్ అన్ని Govt.జాబ్స్‌కు ఉపయోగపడును. Q:10th పాస్. అప్లికేషన్ లాస్ట్ డేట్: 17-08-2024. # సాయి ఇన్‌స్టిట్యూట్, కమలానగర్, ATP. 9059729829. [A-1314]

YOGA, CRAFT COURSES

■ కేవలం ఫీజు 3750/- రాయితీతో దరఖాస్తులు. అన్ని Govt & ప్రైవేట్ జాబ్స్‌కు AP-SBTET ద్వారా పాస్ అయిన సర్టిఫికెట్ ఉపయోగపడును. Q : ఇంటర్ / డిప్లొమా లాస్ట్‌డేట్. 17-8-2024. # సాయి ఇన్‌స్టిట్యూట్, కమలానగర్, ATP. 9059723829. [A-1315]

GNM (నర్సింగ్) అడ్మిషన్స్

■ On-Line అప్లికేషన్స్ స్టార్ట్. ఇంటర్ ఏనీ గ్రూప్ పాస్ స్టూడెంట్స్ కి GNM (నర్సింగ్) కోర్స్ నందు గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర : G.మురళి, 9030661651 అనంతపురం. [A-1317]

ఒకే సం:లో 10/ఇంటర్ / డిగ్రీ / PG

■ 14 సం॥లు పూర్తి అయినవారు SSC పరీక్షలకు అర్హులు. 2023 June కు ముందు SSC పాసైనవారు Inter One Sitting కు అర్హులు. Degree (3 Years), PG (2 Years) దూరవిద్య ద్వారా, శ్రీ సత్యసాయి కోచింగ్ సెంటర్, ATP. 9490624642. [A-762348]

REAL ESTATE

HOUSE FOR SALE

■ ATP to TDP హైవే రోడ్డుకు, BKS దాటాక, నూతన గేటెడ్ కమ్యూనిటీ నందు 2BHK & 3BHK డూప్లెక్స్ విల్లాలు అమ్మబడును. శ్రావణమాసం ఆఫర్ : స్పాట్ బుకింగ్ పై స్పెషల్ డిస్కౌంట్ కలదు. 9515860608, 7396540409. [A-1308]

మీ పెట్టుబడికి - అధిక రాబడి

■ ATP బళ్ళారి రోడ్డుకి 3 సెంట్ల ప్లాట్లు తక్కువ రేట్లకు లభించును. వెంచర్ నందు తారు రోడ్లు, ఎలక్ట్రిసిటి లైన్స్, అన్ని డెవలప్‌మెంట్స్ తో కలిసి ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్ ఎయిర్ పోర్ట్ ప్రపోజల్ ఉన్న రిత్యా. తక్కువ టైమ్‌లో రాబడి అధికంగా పెరిగే అవకాశం కలదు. బుకింగ్స్ కై వెంటనే సంప్ర : షెక్షావలి 9396205666. [A-1313]

SERVICES

BUSINESS OFFER

■ మా లాభదాయక వ్యాపారంలో భాగస్వామి కావాలనుకుంటున్నారా? వెడ్డింగ్ హాల్ నిర్మాణం కోసం పెట్టుబడిదారులు కావాలి. 9441166484 నెంబర్‌కి సంప్రదించండి. [A-784664]

WANTED

■ ప్రముఖ కంపెనీలో అగ్రికల్చరల్ ఫీల్డ్ వర్క్ చేయుటకు ఫీల్డ్ ఎంప్లాయిస్ కావలెను. Q: Inter, Degree, B.Sc., Agriculture. Cell: 09441366774. [A-1316]

■ SMART BADI ఫోటోషాప్ మరియు వీడియో ఎడిటింగ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుచున్నవి. మరిన్ని వివరాలకు సంప్రదించండి. సెల్: 8686181839. [A-784665]

■ YIP PVT LTD recruits Male or Female Age 18 to 45, Qul: 10th to Any Degree, Salary 18000 and above work from home facility is available. 8121818692 [G-8994]

■ శ్రీ లక్ష్మీ హోంకేర్ : హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబికేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం: 17,000/- రూం+మీల్స్ ఫ్రీ. 9347148051 [G-2142]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K, ఫోన్ : 9160900024, 9640400073 [H-796267]

■ ప్రముఖ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పని చేయుటకు టీమ్ లీడర్లు కావలెను. Exp : 1 to 3 సం॥, శాలరీ + కమీషన్ ఇవ్వబడును. సెల్ : 9642111985. [A-784656]

■ అనంతపురము, ప్రముఖ బ్యాంక్ నందు పనిచేయుటకు GUN MAN కావలెను. జీతం : 22K to 23K GUN ఉన్నవారు మాత్రమే. సంప్ర: 8309988784, 9440087632. [A-1318]

■ కేవలం ఆర్యవైశ్య 25-50 సం॥, 2-వీలర్ వచ్చిన ఆడ/మగ, మార్కెటింగ్ కొరకు / లైన్ మీద తిరుగుటకు @ హైదరాబాద్, బెంగుళూరు (పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్) వ్యాపారం చేయుటకు ఆసక్తి కలిగిన వారు సంప్ర : 9059473904. [A-319]

■ అనంతపురము టౌన్‌లో ప్రముఖ కంప్యూటర్ షాప్ నందు పనిచేయుటకు స్టోర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం : 15,000/- పైన. సంప్ర : 9848784140, 7995297575, 9676625312. [A-6329]

■ అనంతపురం టౌన్, శ్రీకంఠం సర్కిల్ నందు షోరూమ్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. విద్యార్హత ఇంటర్ వయస్సు : 35 - 40 సం॥ ఎక్స్‌పీరియన్స్ కలిగిన లోకల్ వారు మాత్రమే. సంప్ర: 8179290778. [A-784662]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఎస్.ఎమ్.ఇ శాఖ (61577), అనంతపురము, అనంతపురము జిల్లా.

"సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 " లోని సెక్షన్ 13(2) క్రింద జారీ చేసిన నోటీసు కాలమ్ నెం1 లో తెలుపబడిన వ్యక్తులు రుణగ్రహీత/గ్యారంటార్లు గా ఉన్నారు తాకట్టు పెట్టిన ఆస్తి వివరము కాలమ్ నెం.2లో చూపబడినవి. పలుమార్లు రిమైండర్లు పంపినప్పటికీ, కాలమ్ నెం.3లో చూపిన రుణమొత్తమును తిరిగిచెల్లించడంలో రుణగ్రహీత/గ్యారంటారు విఫలమైయ్యారు. ఫలితంగా ఈ బకాయిలు ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం ఎన్.పి.ఏగా వర్గీకరించబడినవి. దిగువ వివరించిన రుణఖాతాలోని రుణగ్రహీత/గ్యారంటార్లకు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు పంపగా, అది చేరకుండా వాపసు వచ్చినది. అందువలన సంబంధిత రుణగ్రహీత పేరుకు ఎదురుగా కాలమ్ నెం.3లో తెలిపిన బకాయి రుణమొత్తమును ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాలని వారిని ఇందుమూలముగా కోరడమైనది. లేనిచో వారి నుండి బకాయి రుణమొత్తము రాబట్టుకునేందుకు సంబంధిత రుణఖాతాలో దిగువ తెలిపిన తనఖా పెట్టిన ఆస్తిపై చట్టం లోని సెక్షన్ 13(2) క్రింద **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్.ఎమ్.ఇ శాఖ, అనంతపురము** వారు చర్యలు చేపట్టుట తప్పనిసరి అవుతుంది.

ఋణ గ్రహీతలు & గ్యారంటార్లు (1)	స్థిరాస్తి వివరణ (2)	బకాయి రుణమొత్తము రూలలో & NPA Date (3)
మెసర్స్ శ్రీ మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ప్రొ॥ దేవరకొండ వెంకటేశులు, ప్లాటు నెం.27, సర్వే నెం.651ఎ1 & 651 బి1 టెక్స్‌టైల్ పార్క్, 74 ఉడేగోళం, రాయదుర్గం, అనంతపురము జిల్లా. మరియు శ్రీ డి. వెంకటేశులు తండ్రి: డి. మాధవయ్య డోర్.నెం.17-1-142-1, 17-1-142-2, రాయదుర్గం మున్సిపాలిటి, పోస్టు ఆఫీసు దగ్గర, రాయదుర్గం, అనంతపురము జిల్లా. **A/C No.s:** 1) 37098068257 (Term Loan), 2) 40397044345 (WCTL), 3) 34940858490 (Home Loan) గ్యారంటార్లు శ్రీ దేవరకొండ నాగేంద్ర ప్రసాద్, తండ్రి: డి మాధవయ్య డోర్.నెం.13-1-79, దబ్బిడి చెన్న మాలప్ప వీధి, 13వ వార్డు, రాయదుర్గం, అనంతపురము జిల్లా. 2. శ్రీ డి. వెంకటేశులు, తండ్రి: డి. మాధవయ్య డోర్.నెం.17-1-142-1, 17-1-142-2, దండుబసప్ప వీధి, బళ్లారి రోడ్డు, రాయదుర్గం, అనంతపురము జిల్లా.	**పార్ట్-1:** (డాక్యుమెంట్ల లో తెలిపిన దాని ప్రకారము తనఖా ఉంచిన ఆస్తులు, ప్రస్తుత ఆస్తులు స్టాక్స్ సహా, రిసీవబుల్స్, కన్స్యూమబుల్ స్టోర్ మరియు విడిభాగాలు మరియు తనఖాలో ఉంచిన ప్లాంటు మరియు మెషినరి మొదలగునవి.) (షెడ్యూలు బి) **పార్ట్ నెం.2:** (డాక్యుమెంట్లు/డీడ్ల ప్రకారము బ్యాంకుకు తనఖా ఉంచిన స్థిరాస్తులు) **ప్రాపర్టీ నెం.1:** అనంతపురము జిల్లా, రాయదుర్గము, రాయదుర్గము మున్సిపాలిటీ, బళ్ళారి రోడ్డు, సర్వే నెం.193-5ఎ, ప్లాటు నెం.49, 50 & 51, డోర్.నెం.17-2-296 దగ్గర, 17 వ వార్డు 2వ బ్లాకు నందు కల ఆస్తి, రిజిష్టర్డు పార్టీషన్ డీడ్ నెం.3271/2016, తేది.06.12.2016, రెక్టిఫికేషన్ డీడ్ నెం.1598/2017, తేది.26.05.2017 మరియు జి.పి.ఎ డాక్యుమెంట్ నెం.2071/2017, తేది.31.07.2017. ఈ ఆస్తి శ్రీ డి. నాగేంద్ర ప్రసాద్ తండ్రి: డి. మాధవయ్యకు చెందినది. **దీనికి హద్దులు:** ఉత్తరము:20 అడుగుల వెడల్పుగల రోడ్డు, దక్షిణము: ఇదే సర్వే నెంబరులో నాయకుల సిద్దప్పకు చెందిన భూమి, తూర్పు: ప్లాటు నెం.52, పడమర:ప్లాటు నెం.48. **స్థలము యొక్క విస్తీర్ణము:** 2700 చ॥అ॥లు లేదా 6.20 సెంట్లు. **కొలతలు:** తూర్పు-పడమర: 60 అడుగులు లేదా 18.20 మీటర్లు, ఉత్తరము-దక్షిణము: 45 అడుగులు లేదా 13.65 మీటర్లు. ప్రాపర్టీ నెం.2: అనంతపురము జిల్లా, రాయదుర్గం, రాయదుర్గం మున్సిపాలిటి, బళ్లారి రోడ్డు, సర్వే నెం.225/ఎ, డోర్.నెం.17-1-142-1, 17-1-142-2 నందు ఉన్న ఆస్తి. **రిజిష్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1377/2015 & 1378/2015, తేది.05.06.2015.** ఈ ఆస్తి శ్రీ డి. వెంకటేశులు తండ్రి: డి. మాధవయ్యకు చెందినది. **దీనికి హద్దులు: డాక్యుమెంట్ నెం.1377/2015:** ఉత్తరము:డాక్యుమెంట్ నెం.1378/2015 నందు ఉన్న ఆస్తి, దక్షిణము: సత్యనారాయణకు చెందిన ఇల్లు, తూర్పు:రోడ్డు, పడమర:మేచిరి శ్రీనివాసులకు చెందిన ఇల్లు, **కొలతలు:** తూర్పు-పడమర:58 అడుగులు లేదా17.59 మీటర్లు. ఉత్తరము-దక్షిణము:13 1/2 అడుగులు లేదా 4.10 మీటర్లు. విస్తీర్ణము:1.79 సెంట్లు. **డాక్యుమెంట్ నెం.1378/2015:** ఉత్తరము:పబ్లిక్ రోడ్డు, దక్షిణము: డాక్యుమెంట్ నెం.1377/2015 నందు ఉన్న ఆస్తి, తూర్పు:రోడ్డు, పడమర:మేచిరి శ్రీనివాసులకు చెందిన ఇల్లు, **కొలతలు:** తూర్పు-పడమర:58 అడుగులు లేదా17.59 మీటర్లు. ఉత్తరము-దక్షిణము:11 1/2 అడుగులు లేదా 3.49 మీటర్లు. విస్తీర్ణము:1.53 సెంట్లు. **మొత్తము విస్తీర్ణము:** 1450 చ॥అ॥లు లేదా 161.11 చ॥గ॥లు లేదా 3.32 సెంట్లు.	1) 31.07.2024 నాటికి రూ॥81,53,863/- (అక్షరాల ఎనభై ఒక్క లక్షల యాభై మూడు వేల ఎనిమిది వందల అరవై మూడు రూపాయలు మాత్రమే) 2) తేది.31.07.2024 నాటికి రూ॥2,25,365/- (అక్షరాల రెండు లక్షల ఇరవై ఐదు వేల మూడువందల అరవై ఐదు రూపాయలు మాత్రమే) 3) తేది.31.07.2024 నాటికి రూ॥8,37,132/- (అక్షరాలఎనిమిది లక్షల ముప్పై ఏడు వేల నూటా ముప్పై రెండు రూపాయలు మాత్రమే) తేది.01.08.2024 నుండి తదుపరి భవిష్య వడ్డీ మరియు ఖర్చులు అదనం NPA Date 30.07.2024

తేది:02.08.2024
ప్రదేశం: అనంతపురము

సం/- అధీకృత అధికారి,
ఎస్.ఎమ్.ఇ శాఖ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
అనంతపురము

ఆ బ్రిడ్జికి మళ్లీ శంకుస్థాపన



ఫిబ్రవరి 22న ఎ.నారాయణపురం బ్రిడ్జికి శంకుస్థాపన చేసిన అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ప్రస్తుత జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ (ఫైల్)



బుధవారం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు

- అత్యుత్సాహం ప్రదర్శించిన టీడీపీ ప్రజాప్రతినిధులు
- ఎ.నారాయణపురం బ్రిడ్జికి వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.4.79 కోట్లతో శంకుస్థాపన
- కూటమి ప్రభుత్వం రాకతో మరోసారి ఆర్భాటంగా శంకుస్థాపన

అనంతపురం సిటీ: కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నెన్నో వింతలు, విడ్డూరాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా అటువంటి ఉదంతమే ఒకటి బుధవారం చూడాల్సి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల చేసి, అన్ని రకాల అనుమతులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేసిన పనులకు టీడీపీ ప్రజాప్రతినిధులు మళ్లీ శంకుస్థాపన చేస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. అనంతపురం రూరల్ ఎ.నారాయణపురం సమీపంలోని ఆర్డీటీ చెక్‌డ్యాం సమీపంలో బ్రిడ్జి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో మాట్లాడి రూ.4.79 కోట్లు మంజూరు చేయించారు. 2023 నవంబర్ 23న ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా.. 2023 డిసెంబర్ 19న టెండర్లు పిలిచారు. 2024 జనవరి 11న టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. 2024 ఫిబ్రవరి 5న రివర్స్ టెండరింగ్ పిలవగా 2024 మార్చి 14న ఎ.ఈశ్వర్‌రెడ్డి అనే కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. అనంతరం 2024 ఫిబ్రవరి 22న అప్పటి అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ శంకుస్థాపన చేశారు.

తాజాగా మరోసారి శంకుస్థాపన..

గత ప్రభుత్వం చేసిన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు ఇప్పటి కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారు. మళ్లీ అదే పని చేస్తుండటంతో ప్రజలు నవ్వుకుంటున్నారు. ఎ.నారాయణపురం బ్రిడ్జికి తాజాగా బుధవారం మరోసారి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్, మడకశిర ఎమ్మెల్యేలు వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు పాల్గొనడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. తమపై ఎన్నో ఆశలు పెట్టుకుని పట్టం కట్టిన ప్రజలకు ఇంకా అదనంగా ఏదైనా పనులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేస్తే బాగుంటుంది. ఇలా గత ప్రభుత్వం మంజూరు చేసిన వాటిని తామే చేసినట్లు గొప్పలకు పోవడం విడ్డూరంగా ఉందంటూ ఎ.నారాయణపురం పంచాయతీ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఐదు గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా నిలిచే బ్రిడ్జికి రెండోసారి శంకుస్థాపన చేయడం వల్ల ప్రయోజనం ఏమిటో అంతుబట్టడం లేదంటున్నారు. ఇదే పంచాయతీలో మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించి ఉంటే బాగుండేదని ఆయా గ్రామ ప్రజలు అంటున్నారు.

క్లుప్తంగా

జాతీయ జెండా ఎగరాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: ప్రతి ఇంటా జాతీయ జెండా రెపరెపలాడాలని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు, కార్యాలయాలపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. ప్రతి భారతీయుడు దేశభక్తి, జాతీయ భావాన్ని పెంచుకోవాలని సూచించారు. దేశభక్తి, ఐక్యత స్ఫూర్తిని నింపేందుకే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మమత, ఆచార్య టి.బాల నరసయ్య, డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ ఓం ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు తరలిరండి

అనంతపురం కార్పొరేషన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం 8:15 గంటలకు పార్టీ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది.

ఈ-క్రాప్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి తెలిపారు. బుధవారం ఆయన రూరల్ ఏఓ జే.శశికళ, ఏఈఓ మురళీకృష్ణతో కలిసి మండల పరిధిలోని రాచానపల్లిలో రైతులు సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. అధిక దిగుబడులకు కందిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ... పంట నమోదు వల్ల ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ లాంటి చాలా ప్రయోజనాలు ముడిపడివున్నందున నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఆర్ఎస్‌ఏ ప్రతినిధుల ద్వారా ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. పంటలు వేసుకోని రైతులకు ఉలవలు, అలసందలు, పెసలు, కొర్రలు, మినుములను 80 శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. బుధవారం ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు 117 జీఓ ప్రకారం చేపట్టడం అసంబద్ధమైన ప్రక్రియ అన్నారు. ఈ జీఓ ప్రకారం ఇంటర్ మేనేజ్‌మెంట్ పద్ధతిలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే అనేకమంది ఉపాధ్యాయులు మిగులు జాబితాలోకి చేరతారన్నారు. ముందుగా 117 జీఓను రద్దు చేసి సర్దుబాటు ప్రక్రియను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు ఓబులేసు, యూటీఎఫ్ నగర నాయకులు నాగేంద్ర, ఏపీటీఎఫ్-1938 నగర నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, టీఎన్‌యూఎస్ నాయకులు యుగంధర్, ఏపీ మున్సిపల్ పీడీ,పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, లోకయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

గుజరీ వ్యాపారి మృతి

కూడేరు: అనంతపురానికి చెందిన గుజరీ వ్యాపారి భాస్కర్ (48) గుండె పోటుతో బుధవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. గుజరీ వ్యాపారి భాస్కర్ ఆటోలో వ్యాపారం చేసుకుంటూ మంగళవారం సాయంత్రం కూడేరులోని పీర్లచావిడి కట్ట వద్దకు చేరుకున్నాడు. రాత్రికి అక్కడే నిద్రించాడు. బుధవారం ఉదయం నిద్ర లేవకపోవడంతో స్థానికులు పలకరించారు. చలనంలేకపోవడంతో 100కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. లైసెన్స్ కార్డు ఆధారంగా నంద్యాల జిల్లా డోన్ దగ్గర దొరపల్లి వ్యక్తి అని, కొన్నేళ్లుగా నగరంలో ఉంటున్నట్లు గుర్తించారు. సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చని కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదుకున్నారు. మృతునికి భార్య (దివ్యాంగురాలు ,ఇద్దరు కుమార్తెలున్నారు.

అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: అర్హతే ప్రామాణికంగా టిడ్కో ఇళ్ల కేటాయింపు జరిగిందని మేయర్ వసీం స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం మేయర్ వసీం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టిడ్కో ఇళ్ల కేటాయింపులో ఇటీవల ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అక్రమ లబ్ధిదారులను ఏరి వేస్తామని ఎమ్మెల్యే అంటున్నారని.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, తప్పు జరిగి ఉంటే నిరూపించాలన్నారు. టీడీపీ హయాంలో డీడీలు చెల్లించిన వారికే టిడ్కో ఇళ్లు కేటాయించామని పేర్కొన్నారు. అప్పట్లో ఎవరైతే డీడీలు చెల్లించారో వారికే ఇళ్లు కేటాయించడం జరిగిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కూడా 20 నుంచి 25 శాతం పనులు జరిగాయని తెలిపారు. అయితే ఒక్క ఇంచు కూడా పనులు జరగడం లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి చెప్పడం సరికాదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీలు, కులాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించినట్లు గుర్తు చేశారు. బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ఎక్కడికి వెళ్లినా అక్రమాలు, అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిజంగా అవినీతి జరిగింటే విచారణకు ఆదేశించాలన్నారు.

కళాశాలల్లో సౌకర్యాలు కల్పించండి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి శివ, భీమేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కళాశాల విద్యార్థులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించాలన్నారు. అదే విధంగా మధ్యాహ్న భోజనాన్ని పునఃప్రారంభించాలని కోరారు. మధ్యలో ఆగిపోయిన నాడు-నేడు పనులను పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు నారా లోకేష్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పునః ప్రారంభించాలని తెలిపారు. విద్యాశాఖ మంత్రి అయినప్పటికి అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయంపై ప్రస్తావించకపోవడం దౌర్భాగ్యమని మండిపడ్డారు. చాలా కళాశాలల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహిళా నాయకురాళ్లు భార్గవి, సుజాత, మౌనిక, ఝాన్సీ, శశికళ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు: మండలంలోని ప్రజా సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రజా సమస్యల వేదిక నిర్వహించారు. భూ సమస్యలతో పాటు రేషన్ కార్డులు, తాగునీరు, ఇంటి స్థలాలు, ఇళ్లు, పింఛన్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, రోడ్లు, చెక్ డ్యాంలు, శ్మశానాలకు ప్రహరీలు, ఆలయాల వద్దకు రోడ్లు వేయాలంటూ పలువురు వినతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు పంపి సకాలంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించి, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శివ కృష్ణ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలా హజరత్ ఉరుసు

అనంతపురం కల్చరల్: బిందెల కాలనీలో బుధవారం రాత్రి ఆలా హజరత్ ఉరుసు నిర్వహించారు. మేయర్ వసీం హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, కో-ఆప్షన్ సభ్యులు శంషుద్దీన్, మసీదు కమిటీ సభ్యులు అన్వర్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బషీర్, జిలాన్, ఖాజా పాల్గొన్నారు.

కొనసాగుతున్న జూడాల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: కలకత్తాలో పీజీ విద్యార్థిని హత్యాయత్నాన్ని నిరసిస్తూ.. గత మూడ్రోజులుగా బోధనాస్పత్రిలోని జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లు చేస్తున్న నిరసనలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆప్ జూడా ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులు, హౌస్‌సర్జన్లు నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీ ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి పోలీసు పరేడ్ గ్రౌండ్, కోర్టు రోడ్డు, క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్ మీదుగా వైద్య కళాశాల వరకు సాగింది. క్లాక్‌టవర్ వద్ద జూడాలు, హౌస్‌సర్జన్లు మానవహారంగా ఏర్పడి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం వైద్యులకు భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆప్ జూడా అసోసియేషన్ అధ్యక్షుడు హరికిరణ్, పీజీలు ఆరిఫ్, విఘ్నేశ్వర, నవీన్, హౌస్‌సర్జన్ అసోసియేషన్ సమరసింహారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

టూటౌన్ సీఐగా శ్రీకాంత్

అనంతపురం సెంట్రల్: నగరంలో రెండవ పట్టణ సీఐగా శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రొద్దుటూరు సీఐగా పని చేస్తున్న ఈయన బదిలీపై టూటౌన్ సీఐగా నియమితులయ్యారు.

రాప్తాడు సీఐగా వెంకట శ్రీహర్ష

రాప్తాడు: రాప్తాడు సీఐగా తోట వెంకట శ్రీహర్ష బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ మునిస్వామి వీఆర్‌కు వెళ్లగా.. పుట్టపర్తి ఎస్పీ కార్యాలయంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న తోట వెంకట శ్రీహర్ష ఇక్కడికి బదిలీపై వచ్చారు.

అకడమిక్ కన్సల్టెంట్ల ఇంటర్వ్యూలు 16కు వాయిదా

అనంతపురం సెంట్రల్: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో నిర్వహించాల్సిన అకాడమిక్ కన్సల్టెంట్ల వాక్‌ఇన్ ఇంటర్వ్యూలను ఈనెల 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.కృష్ణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

అకడమిక్ కన్సల్టెంట్లను కొనసాగించాలి

అనంతపురం సెంట్రల్: ఎస్కే యూనివర్సిటీలో ప్రస్తుతం పని చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లను కొనసాగించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న వారిని ఇప్పుడు తొలగించాలని చూడటం భావ్యం కాదన్నారు. రాజకీయాలకు ముడిపెట్టి తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు.

పరేడ్ మైదానికి రూట్‌ల కేటాయింపు

అనంతపురం సెంట్రల్: పోలీసు పరేడ్ మైదానంలో గురువారం జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లే వారికి ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ప్రత్యేక రూట్‌లను కేటాయించినట్లు డీఎస్పీ టీవీవీ ప్రతాప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ వాహనాలు కోర్టు రోడ్డులోని పోలీసు పెట్రోల్ బంకు మీదుగా పరేడ్ మైదానానికి చేరుకుంటాయన్నారు. మిగతా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వేడుకలు వీక్షించేందుకు వచ్చే ప్రజలు జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్ మీదుగా వెళ్లాలని సూచించారు. విద్యార్థులు, ప్రజలు ఉదయం 8:20 గంటలకల్లా పరేడ్ మైదానానికి చేరుకోవాలన్నారు.

జేఎన్‌టీయూ ఓఎస్డీగా దేవన్న

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టియూ ఓఎస్డీగా ఆచార్య ఎస్.దేవన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆచార్య ఎస్.దేవన్న మాట్లాడుతూ.. ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

యోగా సాధనతో జీవితం ఆనందమయం

అనంతపురం కల్చరల్: వయస్సుతో సంబంధం లేకుండా జ్ఞానతృష్ణను తీర్చుకోవడానికి కేవలం జిజ్ఞాస ఉంటే చాలని ప్రముఖ వక్త డాక్టర్ ఆశావాది సుధామ వంశీ అన్నారు. బుధవారం స్థానిక అరవింద నగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో 'అరవింద ఘోష్ జీవితం-ఆయనపై యోగా ప్రభావం' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి జీవితంలో ఏ పరిణామం ఎప్పుడు, ఎలా జరుగుతుందో తెలియదని.. కానీ ఐహిక వాంఛలతో జీవితాన్ని సతమతం చేసుకుంటున్నామన్నారు. అరవిందుడి తత్వం ప్రకారం అందరూ యోగ సాధన ద్వారానే జీవితాన్ని ఆనందమయం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ఫౌండర్ డాక్టర్ మీరా రాణి, సభ్యులు బత్తలపల్లి సత్యరంగారావు, విజయలక్ష్మి, స్వాతి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

ఆత్మకూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎంఈఓ నరసింహారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని వేపచెర్ల ఎగువ తండాలోని పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. భోజనం మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. తాజా కూరగాయలతో కూరలు వండాలన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. బడి బయట పిల్లలు ఉండరాదని పేర్కొన్నారు.

వ్యాసరచన పోటీలు

అనంతపురం కల్చరల్: స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలను పురస్కరించుకుని బుధవారం పురావస్తు శాఖ ప్రదర్శన శాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పర్యాటక శాఖ, ఇంటాక్ (భారతీయ కళలు, వారసత్వ పరిరక్షణ సంస్థ) సంయుక్త ఆధ్వర్యంలో జాతీయోద్యమంలో దేశభక్తుల జీవితాలపై సాగిన పోటీల్లో పలు విద్యా సంస్థలు, కళాశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. పురావస్తు ప్రదర్శన శాలల శాఖ ఏడీ రజిత, టూరిజం అధికారి రాంకుమార్, ఇంటాక్ కన్వీనర్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

ఆత్మకూరు: పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామని డివిజనల్ పంచాయతీ అధికారి సుమన జయంతి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ సెక్రటరీల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివ శంకర్, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రాప్తాడు: పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీఓ సాల్మన్ పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం దిశగా పని చేయాలన్నారు. పంచాయతీల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా అవసరమైన అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంతో పాటు వాటి అమలులో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

నేడు సంగీత నీరాజనం

అనంతపురం కల్చరల్: భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా గాయనీ గాయకులు దేశభక్తి పాటలతో నీరాజనాలర్పించనున్నారు. పద్మశ్రీ ఘంటసాల సంగీత సాంస్కృతిక సేవా ట్రస్టు, పాత పాటల ప్రేమికుల సమూహం సంయుక్తంగా గురువారం సాయంత్రం హౌసింగ్ బోర్డులోని పార్కులో ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని నిర్వాహకులు ఘంటసాల రామయ్య, ఓబులదాసు ప్రకటనలో తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



బాస్కెట్ బాల్ ఆడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: మానసిక ఉల్లాసానికి, శరీర ధృఢత్వానికి, ఆరోగ్యానికి క్రీడలు చాలా ముఖ్యమని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. బుడ్డప్ప బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర్ ప్రసాద్‌తో కలిసి నగర్ రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత్ బాస్కెట్ బాల్ జట్టుకు అనంతపురం నగరానికి చెందిన కె.ద్వారకనాథ్ రెడ్డి ఎంపికైనట్లు గుర్తు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టును ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. డీఎస్డీఓ షఫీ, అనంతపురం నగర మునిసిపల్ కమిషనర్ మూర్తి, బాస్కెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ నరేంద్ర చౌదరి, రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం రామాంజులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.













● దుర్గావతి
విప్లవ వనిత

మూడేళ్ల కొడుకును పణంగా పెట్టి...

భగత్‌సింగ్‌ను కాపాడిన భాభీ

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌వీర్... వీరంతా ఆమెను 'దుర్గా భాభీ' అని పిలిచేవారు. సాయుధ పోరాటంతోనే బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టగలం అని భావించిన దళంలో పిస్తోల్ పట్టిన తొలి విప్లవ వనిత దుర్గావతి దేవి. బ్రిటిష్ అధికారి సాండర్స్‌ను హత్య చేసిన భగత్‌సింగ్‌ను లాహోర్ నుంచి తప్పించేందుకు అతడి భార్య అవతారం ఎత్తిందామె. చరిత్ర పుటలలో కనుమరుగై పోయిన ఆ త్యాగమయి గురించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

'సైమన్ గోబ్యాక్' నిరసన కార్యక్రమం చేస్తున్న లాలా లజపతిరాయ్ మీద బ్రిటిష్ పోలీసుల లాఠీచార్జీ జరిగి ఆయన ప్రాణం పోయింది. పంజాబ్‌లో యువతకు మార్గదర్శిగా ఉన్న ఆ మహా నాయకుణ్ణి కోల్పోయినందుకు 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' (హెచ్ఎస్ఆర్ఏ) సభ్యులకు ఆగ్రహం వచ్చింది. ఇది స్వాతంత్ర్య సమరయోధుడు భగవతి చరణ్ ఓహ్రా నడుపుతున్న గ్రూప్. చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ తదితరులంతా ఇందులో సభ్యులు. వీరంతా కలిసి లాఠీచార్జిని ఆర్డర్ వేసిన బ్రిటిష్ ఆఫీసర్ స్కాట్‌ను చంపాలనుకున్నారు. నిర్ణయం అమలు పరచడమే తరువాయి.


● టెలివిజన్ ఎపిసోడ్‌లో భగత్‌సింగ్, దుర్గా భాభీ

స్కాట్ బదులు సాండర్స్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు 17 డిసెంబర్ 1928న లాహోర్‌లో పోలీస్ ఆఫీసర్ స్కాట్‌ను హతమార్చడానికి సిద్ధమయ్యారు. అయితే బైక్ మీద రావాల్సిన స్కాట్ కారులో, కారులోనూ రావాల్సిన మరో అధికారి సాండర్స్ బైక్ మీద రావడంతో అయోమయం నెలకొంది. అయినా సరే ఎదురుపడిన సాండర్స్‌పై మొదట రాజ్‌గురు, ఆ తర్వాత భగత్ సింగ్ తుపాకీ పేల్చి అతణ్ణి హతమార్చారు. లాహోర్ అంతా గగ్గోలు రేగింది. వందలాది మంది పోలీసులు అన్ని దారులు... బస్టాండ్లు... రైల్వేస్టేషన్లు కమ్ముకున్నారు. లాహోర్‌లో ఉండటం భగత్‌సింగ్‌కు ఏ మాత్రం మంచిది కాదు. అతణ్ణి తప్పించేవారు ఎవరు?

ఆమె వచ్చింది

భగవతి చరణ్ ఓహ్రా సతీమణి దుర్గావతిని అందరూ దుర్గాభాభీ అని పిలిచేవారు. సాండర్స్‌ని హత్య చేశాక భగత్‌సింగ్, రాజ్‌గురు నేరుగా దుర్గావతి దగ్గరకు వచ్చారు. అప్పటికి ఆమె భర్త వేరే పని మీద కలకత్తా వెళ్లి ఉన్నాడు. జరిగింది తెలుసుకున్న దుర్గావతి వెంటనే భగత్‌సింగ్‌ను లాహోర్ దాటించడానికి సిద్ధమైంది. జుట్టు కత్తిరించుకుని హ్యాట్ పెట్టి రూపం మార్చిన భగత్‌సింగ్‌కు ఆమె భార్యగా నటిస్తూ తన మూడేళ్ల కొడుకుతో మరుసటి రోజు సాయంత్రం లాహోర్ నుంచి డెహ్రాడూన్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో మొదటి తరగతి ప్రయాణికురాలిగా బయల్దేరదీసింది. వందలాది నిఘా కళ్ల మీద ఈ పని చేయడం చాలా ప్రమాదం... మూడేళ్ల కొడుక్కు కూడా ఏదైనా కావచ్చు అని భగత్‌సింగ్ ఆమెతో అన్నాడు. 'నా కొడుక్కు మరణం సంభవిస్తే ఒక దేశభక్తునిగా తన ప్రాణం అర్పించే అవకాశం వాడికి దక్కుతుంది' అని చెప్పి ఆమె ముందుకు కదిలింది. భగత్‌సింగ్ ఆధునికవేషంలో ఉన్న అధికారిగా, దుర్గావతి అతని భార్యగా, రాజ్‌గురు నౌకరుగా ఆ ప్రయాణం చేశారు. బ్రిటిష్ వాళ్లకు ఏ మాత్రం అనుమానం రాలేదు. భగత్‌సింగ్‌ను అలా క్షేమంగా కలకత్తా చేర్చి వెనక్కు వచ్చింది దుర్గావతి.

గొప్ప దేశభక్తురాలు

స్వతంత్ర పోరాటం చేస్తున్న భగవతి చరణ్ ఓహ్రాను వివాహం చేసుకునేనాటికి దుర్గావతికి 13 ఏళ్లు. పెళ్లి తర్వాతనే చదువుకుంది. ఇంట్లో ఇరుగు పొరుగు పిల్లలకు పాఠాలు చెప్పేది. సాయుధ పోరాటం చేయాలన్న భర్త ఆశయానికి మద్దతుగా నిలిచిందామె. భగత్‌సింగ్‌ను తన కన్నబిడ్డలా భావించింది. భగత్ సింగ్ పార్లమెంట్‌లో బాంబు దాడి చేసి అరెస్ట్ అయ్యాక ఆ తర్వాతగాని అతడే సాండర్స్ హత్యలో ఉన్నాడన్న సంగతి పోలీసులకు తెలియలేదు. ఆ కేసు వాదనలను బ్రిటిష్ ప్రభుత్వం హడావిడిగా ముగించి అక్టోబర్ 7, 1930న తీర్పు వెలువరించి భగత్‌సింగ్‌కు మరణశిక్ష విధించింది. అయితే లాహోర్‌లో ఈ విచారణ జరుగుతున్నప్పుడు భగత్‌సింగ్‌ను తీసుకెళ్లే వ్యానుపై బాంబుదాడి చేసి అతణ్ణి కాపాడాలని ప్లాన్ చేసింది దుర్గావతి. వీలు కాలేదు.

భర్తను కోల్పోయి

భగత్‌సింగ్‌ను జైలు నుంచి రక్షించడానికి స్వదేశీ జ్ఞానంతో బాంబులు తయారు చేస్తూ ప్రమాదవశాత్తు భగవతి చరణ్ ఓహ్రా మరణించాడు. అంత కష్టాన్ని తట్టుకుని దేశం కోసం పోరాడాలనుకుంది దుర్గావతి. భగత్‌సింగ్ మరణశిక్ష విధించాక ఆగ్రహంతో బొంబాయి వెళ్లి బ్రిటిష్ గవర్నర్‌ను చంపాలనుకుంది. అయితే గవర్నర్ దొరకలేదు. మరో బ్రిటిష్ అధికారి మీద స్వయంగా గుళ్ల వర్షం కురిపించి పగ చల్లార్చుకుంది. భగత్ సింగ్ ఉరి (1931 మార్చి 23) తర్వాత తన వాళ్లంటూ ఎవరూ లేకపోవడం, పోలీసుల వెతుకులాట ఎక్కువ కావడంతో తనే వెళ్లి లొంగిపోయింది. మూడేళ్ల జైలు శిక్ష అనంతరం మొదట లక్నో ఆ తర్వాత ఘజియాబాద్‌లో పెద్దగా పబ్లిక్‌లో ఉండటానికి ఇష్టపడక స్కూల్ నడుపుతూ 1999లో తన 92వ ఏట మరణించిందా గొప్ప దేశభక్తురాలు, భారత తొలి సాయుధ పోరాట సమరయోధురాలు దుర్గాభాభీ.

పోస్టల్ స్టాంపులు

యుద్ధం ముద్రలు

మహిళలు ఇల్లు విడిచి బయట అడుగు పెడితే వింతగా చూసే కాలంలో సాహసమే వెన్నెముకగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు ఎంతోమంది మహిళలు. వారి త్యాగాల వెలుగు చరిత్రకే పరిమితమైనది కాదు, వర్తమానంలోనూ స్ఫూర్తిని ఇస్తుంటుంది. ఎంతోమంది మహిళా స్వాతంత్ర్య సమరయోధుల పోస్టల్ స్టాంప్స్ విడుదల అయ్యాయి. ఈ చిన్న స్టాంప్‌లు వారి త్యాగాలు, పోరాట పటిమను ప్రతిఫలిస్తాయి. పోస్టల్ స్టాంప్స్‌పై మెరిసిన కొందరు మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గురించి...

రుక్మిణీ లక్ష్మీపతి



ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని మధురైలో పుట్టింది రుక్మిణీ. గాంధీజీ 'హరిజన సంక్షేమ నిధి' కోసం తన బంగారు నగలన్నీ విరాళంగా ఇచ్చేసింది. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో చురుగ్గా పాల్గొంది. ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టయి జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళగా చరిత్రలో నిలిచింది.

సుభద్రా జోషి



గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితం అయిన సుభద్రా జోషి విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొంది. 'హమారా సంగ్రామ్' పత్రికకు ఎడిటర్‌గా పని చేసింది. సుభద్రను అరెస్ట్ చేసి లాహోర్ సెంట్రల్ జైల్‌కు తరలించారు. విడుదలయ్యాక మళ్లీ ఉద్యమంలో భాగం అయింది. సుభద్ర అంకితభావాన్ని నెహ్రూ ప్రశంసించారు.

రాణి మా గైడిన్లియు



బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన 'హెరాక' ఉద్యమంలో పదమూడు సంవత్సరాల వయసులోనే పాల్గొంది రాణి మా. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి మహిళగా చరిత్రకెక్కింది. 'హెరాక' ఉద్యమంతో పాటు ఎదుగుతూ వచ్చిన రాణి మా ప్రముఖ రాజకీయ నాయకురాలిగా, ఆధ్యాత్మిక గురువుగా ప్రఖ్యాతి పొందింది.

బేగం హజ్రత్ మహల్



తొలి తరం మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు బేగం హజ్రత్ మహల్. బేగం హజ్రత్ ఇతర సంస్థానాధీశులతో కలిసి బ్రిటిష్ వారితో యుద్ధం చేసింది. లక్నో సమీపంలో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారిని ఓడించింది. ఆ తరువాత కాలంలో మాత్రం ఓటమికి గురైంది. బ్రిటిష్ వారికి చిక్కకుండా అడవుల్లో తల దాచుకొని పోరాడేది.

కమలానెహ్రూ



జవహర్‌లాల్ నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ మహిళా సాధికారత కోసం గళం విప్పిన యోధురాలు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అరెస్టై జైలుకు వెళ్లింది. 'దేశ సేవిక' సంఘాలను ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగం అయ్యేలా చేసింది.

సుభద్రాకుమారి చౌహాన్



సుభద్రాకుమారి చౌహాన్ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన తరువాత నాగపూర్ నుంచి అరెస్ట్ అయిన మొట్టమొదటి మహిళా సత్యాగ్రహిగా చరిత్రలో నిలిచింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా పోరాడింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఎన్నో త్యాగాలు చేసింది.

అరుణా అసఫ్ అలి



భర్త అసఫ్ అలీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది అరుణ. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయింది. కాంగ్రెస్‌పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసిన తరువాత బ్రిటిష్ వారు విరుచుకుపడ్డారు. ప్రముఖ నాయకులను అరెస్ట్ చేశారు. ఆ క్లిష్ట సమయంలో అరుణా అసఫ్ అలి కార్యకర్తలకు అండగా ఉంది. బొంబాయి గొవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ జెండాను ఎగరేసి క్విట్ ఇండియా ఉద్యమం ఊపందుకునేలా చేసింది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాహసవంతురాలైన సామాజిక కార్యకర్త, చిన్నతనం నుంచే మహిళల హక్కుల కోసం పోరాడింది. మహాత్మా గాంధీ నుంచి స్ఫూర్తి పొంది స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. గాంధీజీ ప్రభావంతో దుర్గాబాయి మాత్రమే కాదు ఆమె కుటుంబం మొత్తం అన్ని రకాల పాశ్చాత్య దుస్తులను విడిచిపెట్టి, ఖాదీని మాత్రమే ధరించేవారు. మద్రాస్‌లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించింది.

రాజ్‌కుమారీ అమృత్ కౌర్



రాజ్‌కుమారీ అమృత్ కౌర్ సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు. గాంధీజీ కార్యదర్శిగా పని చేసిన ఆమె దండి మార్చ్‌లాంటి ఎన్నో జాతీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంది. క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రాజ్‌కుమారి ఇరవై నెలల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. రాచరిక కుటుంబంలో పుట్టినప్పటికీ మహాత్ముడి ఆశ్రమంలో సాధారణ జీవితాన్ని గడిపింది.

ఇది సైనికుల సంగ్రామం

- ఇంటికొకరుగా ఆర్మీ జవాన్లు
- నాటి పీపుల్స్‌వార్ ఖిల్లా నుంచి నేడు దేశరక్షణకు సరిహద్దుల్లో యువకులు

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలా ఈ ఊరికి ఉన్న ప్రత్యేకత 'దేశభక్తి'. దేశాన్ని కాపాడాలనే ధ్యేయంతో ఊరి యువకులు సైన్యం బాట పట్టారు. ఒకే ఊరి నుంచి ఇంటికి ఒక్కరు చొప్పున సుమారుగా 92 మందికిపైగా యువకులు సైన్యంలో తమ సేవలను అందిస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఖిల్లాగా ఉన్న ఆ ఊరిని ఇప్పుడు ఆర్మీ జవాన్ల పుట్టినిల్లుగా పిలుచుకుంటున్నారు. ఆ ఊరు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం. ఆ ఊరి ముచ్చట్లలోకి వెళదామా?

సుమారు 40 ఏళ్ల క్రితం కట్కూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల డేనియల్ మిలిటరీలో జవాన్‌గా చేరాడు. ఆయన స్ఫూర్తితో గ్రామంలోని యువకులు సైన్యం బాటపట్టారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆర్మీలో చేరారు. జవాన్ స్థాయి నుంచి లాన్స్‌నాయక్, నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇలా గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం 92 మంది ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దాంతో జిల్లాలో కట్కూరు గ్రామం అంటే ఆర్మీజవాన్‌ల గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 1,014 కుటుంబాలుండగా జనాభా సుమారుగా 3,045 ఉన్నారు. అందులో మొత్తం గ్రామంలో 175 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వీరిలో కొందరు ఇతర ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు.

- మాలోతు శ్రీనివాస్, సాక్షి, అక్కన్నపేట

దేశసేవ ఇష్టం...



దేశసేవ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే 1998లో భారతసైన్యంలో చేరాను. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ బెంగళూర్‌లో ట్రైనింగ్ చేశాను. కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నాను. కాశ్మీర్‌లో రాష్ట్రీయ విభాగంలో సేవలు అందించి అనేక టెర్రరిస్ట్ ఆపరేషన్లలో పాల్గొన్నాను. కాశ్మీర్ సేవలను గుర్తించి నాకు సుబేదార్ మేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

- పంజా సదయ్య, సుబేదార్

గర్వపడుతున్నా...



దేశరక్షణ కోసం సైన్యంలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా దేశం కోసం పని చేయడం ఆనందంగా ఉంది.

- కొయ్యడ శ్రీనివాస్, ఆర్మీ జవాన్

మన(సు)లో మాట



మా బాబు ఒకచోట కుదురుగా ఉండటం లేదు...

మా బాబు వయసు 5 సంవత్సరాలు. ఒకచోట నిలకడగా ఉండకుండా, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంట్లో, స్కూల్లో బయటా కూడా ఇలాగే చస్తుంటాడు. బయట ఫంక్షన్లకు తీసుకెళితే తనను పట్టుకోవడం, తన చుట్టూ తిరగడంతోటే సరిపోతుంది. అందువల్ల ఈ మధ్య బయటకు వెళ్లడం కూడా తగ్గించేశాం. వాళ్ల నానమ్మేమో, ఇది పిల్లల్లో మామూలే అంటుంది. ఈ మధ్య వాళ్ల స్కూల్ టీచర్ మమ్మల్ని పిలిచి, మా బాబు మీద అనేక కంప్లయింట్లు చెప్పింది. మాకు చాలా ఆందోళనగా ఉంది.

– కె. మాధవి, సికింద్రాబాద్

పిల్లల మెదడులో ఉండే సెల్ఫ్ కంట్రోల్ విభాగం లోని లోపాల వల్ల, వారసత్వ లక్షణాల రీత్యా, కొందరు పిల్లలకు మీరు చెప్పిన లక్షణాలు రావచ్చు. దీనిని హైపర్ యాక్టివిటీ లేదా ఏడీహెచ్‌డీ అంటారు. నిలకడ లేకపోవడం, చదువు మీద ఏకాగ్రత లేకపోవడం, వస్తువులు విసిరేయడం, సహనం లేకపోవడం, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉండటం, స్కూల్‌లో వస్తువులు మరచిపోవడం, ఈ సమస్య ముఖ్య లక్షణాలు. వీరికి తెలివితేటలు బాగానే ఉన్నప్పటికీ, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనకబడతారు. ఇలాంటి వారిని ఎంత చిన్నవయసులో గుర్తించి, సరియైన చికిత్స చేయిస్తే అంత తొందరగా దీంట్లోంచి బయట పడతారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, అవసరమైతే కొద్ది మోతాదులో కొన్ని మందులు వాడటం ద్వారా వీరిని పూర్తిగా బాగు చెయ్యచ్చు. పేరెంట్స్, టీచర్లు ఇలాంటి వారిని త్వరగా గుర్తించగలిగితే తొందరగా బాగుపడతారు. మైకేల్ ఫిలిప్స్ అనే స్విమ్మర్ ఈ సమస్యతో బాధపడుతూ చికిత్స తీసుకుని బాగుపడి, ఒలింపిక్స్‌లో 20కి పైగా స్వర్ణ పతకాలు సాధించాడు. చైల్డ్ సైకియాట్రిస్ట్‌ల సూచనలు తీసుకోవడం, పాటించడం మేలు చేస్తుంది.



- డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

---

హెల్దీ డైట్

సగ్గుబియ్యం పొంగనాలు



కావలసినవి: సగ్గుబియ్యం – అర కప్పు (గంట సేపు నానబెట్టాలి); పనీర్ తురుము – 75 గ్రాములు; వేరుశనగపప్పుల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; క్యారట్ తురుము – 3 టేబుల్ స్పూన్‌లు ; బంగాళదుంప – 1 (ఉడికించి తొక్క తీసి చిదమాలి); జీలకర్ర పొడి– టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; క్యాబేజ్ తరుగు – ముప్పావు కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు (రెడ్, గ్రీన్ క్యాప్సికమ్); చీజ్ తురుము – 50 గ్రాములు (12 భాగాలు చేసుకోవాలి); నూనె – టీ స్పూన్.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

తయారీ: ● ఒక పాత్రలో క్యాబేజ్ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఇందులో నూనె, చీజ్ మినహా మిగిలినవన్నీ వేసి బాగా కలిపి పన్నెండు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో చీజ్ స్టఫ్ చేస్తూ గోళీలాగా చేయాలి ● గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో ఒక్కో చుక్క నూనె రుద్ది పొంగనాన్ని పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు కాల్చాలి.

పోషకాలు: (ఒక్కో పొంగనంలో)...
● కేలరీలు 63; ● ప్రొటీన్ – 2.5 – 3 గ్రాములు; ● కార్బోహైడ్రేట్లు – 8–9 గ్రాములు; ● ఫ్యాట్ – 2–3 గ్రాములు; ● ఫైబర్– గ్రాము; క్యాల్షియం – 40 –50 గ్రాములు.

అరుదైన ఆహ్వానం

12 ఏళ్లు... 15 లైబ్రరీలు

ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ఇరవై మందిలో విద్యార్థులు ఆరుగురు. వారిలో అమ్మాయి ఒకే ఒక్కరు. ఆ సరస్వతి పుత్రిక పేరు ఆకర్షణ. లైబ్రరీలు స్థాపిస్తూ సాహిత్యాన్ని సామాన్యులకు దగ్గర చేస్తున్న ఆమె అక్షరసేవకు జాతీయ స్థాయిలో అందిన గుర్తింపు ఇది.

''హైదరాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్‌మాస్టర్ నుంచి 12వ తేదీన నాన్నకు ఫోన్ వచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 15వ తేదీన ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కావలసిందిగా మీ అమ్మాయి ఆకర్షణకు ఆహ్వానం వచ్చిందని చెబుతూ అభినందనలు తెలియచేశారు'' అంటూ తాను లైబ్రరీ వ్యవస్థాపకురాలిగా మారిన వివరాలను సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు ఆకర్షణ సతీష్.


● సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతితో...

కోవిడ్ వచ్చినప్పుడు

''హైదరాబాద్‌లో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాన్న సతీశ్ క్యాన్సర్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ ఉద్యోగి. నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాను. పుస్తక పఠనం నా హాబీ కావడంతో వెయ్యికి పైగా పుస్తకాలతో ఇంట్లోనే నాకు సొంత లైబ్రరీ ఉంది. ఇతరుల కోసం లైబ్రరీ స్థాపించాలనే ఆలోచన కోవిడ్ సమయంలో వచ్చింది.

తొలి లైబ్రరీ క్యాన్సర్ హాస్పిటల్‌లో

నాన్న ఉద్యోగరీత్యా క్యాన్సర్ హాస్పిటళ్లకు టచ్‌లో ఉంటారు. కోవిడ్ సమయంలో ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వాళ్లు 'కోవిడ్ కారణంగా వంటవాళ్లు డ్యూటీకి రావడం లేదు. పేషెంట్‌లకు ఆహారం అందించడానికి ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేసి పెట్టవలసింది'గా కోరడంతో నాన్న వాళ్ల కోసం రోజూ భోజనం వండించి తీసుకెళ్లి ఇచ్చేవారు. నాకు స్కూల్ లేకపోవడంతో రోజూ నాన్నతోపాటు హాస్పిటల్‌కి వెళ్లేదాన్ని. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న పేషెంట్‌లలో నా ఏజ్ గ్రూప్ వాళ్లతో స్నేహం ఏర్పడింది. వాళ్లు కొంతమంది చదువుకోవడానికి పుస్తకాలు తెచ్చిపెట్టమని అడిగారు. రోజూ నా పుస్తకాలు కొన్ని తీసుకెళ్లి ఇస్తూ ఉన్నప్పుడు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయలత గారు... 'హాస్పిటల్‌కి చికిత్స కోసం ఎప్పుడూ కొత్తవాళ్లు వస్తుంటారు. హాస్పిటల్‌లోనే లైబ్రరీ ఉంటే బావుంటుంది' అన్నారు. వారి ఆలోచనే నా లైబ్రరీ ఉద్యమానికి నాంది. నా పుస్తకాలతోపాటు మా స్కూల్, అపార్ట్‌మెంట్ స్నేహితుల నుంచి సేకరించిన వెయ్యికి పైగా పుస్తకాలతో తొలి లైబ్రరీ అలా మొదలైంది. ఇప్పటికి 9,836 పుస్తకాలతో 15 లైబ్రరీలు ఏర్పాటు చేయగలిగాను.

పదకొండు వేల పుస్తకాలు

నాలుగేళ్లలో పదకొండు వేల పుస్తకాలు సేకరించాను. అందులో రెండు వేల పుస్తకాలు ప్రధాని నరేంద్రమోదీగారిచ్చారు. ఈ ఏడాది మార్చి 18న కోయంబత్తూరులో ఆయనను కలిసే అవకాశం వచ్చింది. ఆ సందర్భంగా ఆయన 25 లైబ్రరీలు స్థాపించమని, 25 లైబ్రరీ స్థాపనకు స్వయంగా హాజరవుతానని చెప్పారు. భారత రాష్ట్రపతి గత ఏడాది శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కి వచ్చినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కలిశాను. అప్పుడామె 'ప్రజల్లో రీడింగ్ హ్యాబిట్ తగ్గుతోంది, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి దోహదం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కొనసాగించ'మని చెప్పి ఆమే స్వయంగా 74 పుస్తకాలిచ్చారు. ఈ ఏడాది ఢిల్లీ, కర్తవ్య పథ్‌లో జరిగిన 75వ రిపబ్లిక్ డే ఉత్సవాలకు ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యాను. ఇదే ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలకు కూడా హాజరయ్యే అవకాశం కలగడం సంతోషంగా ఉంది'' అంటూ 25 లైబ్రరీల లక్ష్యాన్ని పూర్తి చేస్తానని చెప్పింది ఆకర్షణ సతీశ్.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి